సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



పర్యావరణ స్పృహ పెంచాలి

వేములవాడరూరల్: విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంచాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి కోరారు. రుద్రవరం హైస్కూల్‌లో బుధవారం అవగాహన కల్పించారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను బుధవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.20లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కానీ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రజతోత్సవ సభకు దండుగా కదలిరావాలి

- బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్



సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట: ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు దండుగా కదలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందె సుభాష్, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్, వెంకటాపూర్ గ్రామాల్లో బుధవారం రజతోత్సవసభ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. నమిలికొండ శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్, నర్సింలు, నాగరాజు, సీత్యానాయక్, గట్ల అనిల్, రాములునాయక్, శంకర్‌నాయక్, పర్శరాములు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆహ్వానపత్రిక

సిరిసిల్లలో మాజీ కౌన్సిలర్ దిడ్డి మాధవి డప్పు చప్పుళ్ల మధ్య ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ రజతోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందించారు. నాయకులు గూడూరి ప్రవీణ్, బత్తుల వనజ, వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కూరపాటి భూమేశ్, వేముల తిరుపతి, ముదారపు లలిత పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట

- జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



సిరిసిల్లటౌన్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. స్థానిక కాలేజీగ్రౌండ్‌లో బుధవారం జిల్లాస్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీలను జిల్లావాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొననున్నాయి. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజ్మీర రాందాస్, గుడ్ల రవి, కోడం శ్రీనివాస్, నారాయణ, దేవయ్య, సంపత్, సురేష్, కోడం శ్రీనివాస్, బుర్ర నారాయణ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ



గంభీరావుపేట(సిరిసిల్ల): ఐఐటీ తిరుపతి నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ హాక్ 5.0 వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పాన్నాల లోహిత ప్రతిభ కనబర్చింది. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 30 వరకు దేశవ్యాప్తంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో లోహిత తయారు చేసిన 'క్లాస్ రూం ఫ్రెండినో' ప్రదర్శనకు బహుమతి లభించింది. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నాళ్లీ 'కరెంట్' కష్టాలు !



ఇది రుద్రంగి మండలం వీరునితండాలో వ్యవసాయబావి వద్ద విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడదడంతో సదరు రైతు మిడిల్ పోల్(మధ్య స్తంభం)కు బదులుగా కర్రను ఊతంగా పెట్టుకున్నారు. 2016 నుంచి 2023 వరకు 11,458 మిడిల్ పోల్స్ వేసినట్లుగా, 2024లో మరో 2,897 స్తంభాలను రైతుల పొలాల్లో లూజువైర్లను సవరించేందుకు వేసినట్లుగా 'సెస్' రికార్డులు చెబుతున్నాయి. అయితే ఇలాంటి ప్రదేశాల్లో ఇంకా కర్రస్తంభాలే కనిపిస్తున్నాయి.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్. వాస్తవానికి ఈ భవనం 'సెస్' సభ్యుల సేవాసదన్‌ది. మూడున్నర దశాబ్దాల క్రితం ఎల్లారెడ్డిపేట మండలంలోని విద్యుత్ వినియోగదారుల సేవలందించేందుకు 'సెస్' సంస్థ నిర్మించింది. అప్పట్లో శాంతిభద్రతల కారణంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణకు ఈ భవనాన్ని పోలీసులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆ భవనం పోలీసుల ఆధీనంలో ఉంది. 'సెస్' సంస్థకు సొంత భవనం లేకుండా పోయింది.



ఇది రుద్రంగిలోని సెస్ సభ్యుల సేవాసదన్. రుద్రంగి కొత్త మండలం కావడంతో ఇక్కడ సంస్థకు సొంత స్థలం, భవనం లేదు. ఓ అద్దె భవనంలోని రెండో అంతస్తులో నిర్వహిస్తున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోనూ ఇదే పరిస్థితి.

- వెలుగుల 'సెస్'ను కమ్మిన చీకట్లు
- లూజు వైర్లు.. కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లు
- గుదిబండగా రూ.883.25 కోట్ల బకాయిలు
- నేడు 'సెస్' 51వ మహాసభ

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)కు ఇప్పుడు 'కరెంట్' కష్టాలు ఎదురవుతున్నాయి. 'సెస్' సంస్థ అంటే ఒకప్పుడు వినియోగదారుల శ్రమదానం.. సొంత ఆస్తులు.. ఆర్థిక సమృద్ధి.. సామాజిక సేవలు.. జాతీయబ్యాంకుల్లో భారీగా డిపాజిట్లు.. సొంత సిబ్బందితో అద్భుతమైన సేవలతో గుర్తింపు పొందింది. మరిప్పుడు.. కాంట్రాక్టర్ వ్యవస్థ.. డిప్యూటేషన్ సిబ్బంది.. క్షేత్రస్థాయిలో అవినీతి.. ఏ పని చేయాలన్నా చేతివాటం.. పాలక వర్గాల ధనదాహం.. అద్దె భవనాలు.. ఆవిరైన సంపద.. వెరసి రూ.883.25 కోట్ల బకాయిల భారం.. ఇది 'సెస్' ప్రస్తుత రూపం. 55 ఏళ్ల చరిత్ర గల 'సెస్' సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. 'సెస్' 51వ మహాసభ గురువారం నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏమిటీ 'సెస్' ప్రత్యేకత

కేంద్ర గ్రామీణ విద్యుద్దీకరణసంస్థ(ఆర్‌ఈసీ) దేశవ్యాప్తంగా ఐదు గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలను స్థాపించగా అందులో సిరిసిల్ల 'సెస్' ఒక్కటి. అన్ని సంస్థలు కాలగమనంలో ఉనికి కోల్పోగా సిరిసిల్ల సంస్థ ఉత్తమ సేవలతో ముందుకెళ్తోంది. 'సెస్' పరిధిలో వ్యవసాయాభివృద్ధి, వస్త్రోత్పత్తిరంగ అభివృద్ధికి బాటలు వేసింది. వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లోనే రీప్లేస్ చేస్తారు. విద్యుత్ వినియోగదారులు క్రమం తప్పకుండా కరెంట్ బిల్లులు చెల్లిస్తూ సంస్థకు సహకరిస్తారు.

కాలక్రమంలో.. ఏమైంది ?

విద్యుత్ వినియోగదారులు సభ్యులుగా 'సెస్' సంస్థ కొనసాగుతూ.. పార్టీ రహితంగా ఎన్నికలు జరిగేవి. మండలానికి ఒక్క డైరెక్టర్, వారిలోనే ఒక్కరు చైర్మన్, మరొకరు వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యేవారు. ఇలా సహకార విధానంలో జరిగే ఎన్నికలు రెండు దశాబ్దాలుగా పార్టీల రంగుపులుముకుంది. ఎన్నికల్లో గెలుపు కోసం డబ్బులు ఖర్చు చేయడంతో ఆ డబ్బులు రాబట్టుకునేందుకు 'సెస్'లో అవినీతి బీజాలు పడ్డాయి. సహకార స్ఫూర్తి కనుమరుగై కాంట్రాక్టర్ విధానం వచ్చింది. ఫలితంగా 'నాకెంత.. నీకెంత' అనే ధోరణి మొదలైంది. ఇలా ఎన్నికైన పాలక వర్గాలు సెస్‌ను నిండా ముంచాయి. 2001లో వివిధ వాణిజ్య బ్యాంకుల్లో 'సెస్' సంస్థ ఫిక్స్‌డిపాజిట్లు రూ.150కోట్లుగా ఉండేవి. కాలక్రమంలో అవి కరిగిపోయి.. ఇప్పుడు సంస్థ రూ.వెయ్యి కోట్ల బకాయిల్లో నిండా మునిగింది. చేయి తడపనిదే పనిచేయని స్థాయికి ఉద్యోగులు, సిబ్బంది దిగజారారు.



సిరిసిల్లలో 'సెస్' ఆఫీస్ భవనం

'సెస్' స్వరూపం
సభ్యులు: 3,45,628
ఉద్యోగులు: 355
వ్యవసాయ కనెక్షన్లు : 78,611
మరమగ్గాల కనెక్షన్లు : 8,265
గృహవిద్యుత్ కనెక్షన్లు : 1,65,928
పరిశ్రమలు: 1,657
దుకాణాలు: 14,138
విద్యుత్ సబ్‌స్టేషన్లు: 46

ఆదాయ, వ్యయాలు ఇలా..
విద్యుత్ కొనుగోలు నెలకు : రూ.45 కోట్లు
బిల్లుల వసూలు నెలకు : రూ. 14.50 కోట్లు
ప్రభుత్వం చెల్లించే రాయితీలు: రూ.23.50 కోట్లు
నెలవారీగా సిబ్బంది జీతాలు: రూ.3 కోట్లు
డిస్కమ్‌కు బకాయిలు: రూ.558.44 కోట్లు
సంస్థకు రావాల్సిన బకాయిలు : 624.92 కోట్లు
మొత్తం బకాయిలు: 883.25 కోట్లు



మహాసభ కారాదు మొక్కుబడి !

'సెస్'కు మహాసభ తీర్మానాలే శిరోధార్యం. కానీ సభ్యులు మొక్కుబడిగా చప్పట్లు కొట్టి తీర్మానించడంతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఇప్పటికే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కొన్నారు. కానీ మళ్లీ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. మిడిల్‌పోల్స్ వేయకుండానే వేసినట్లు రికార్డులు రాసిన అంశంపై థర్డ్‌పార్టీ విచారణ బుట్టదాఖలైంది. డబ్బులు తీసుకుని సిబ్బంది నియామకాలు అభాసుపాలయ్యాయి. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా, విద్యుత్ బకాయిలు వసూలుకు ప్రణాళిక సిద్ధంగా పనిచేస్తేనే సంస్థ మనుగడ సాధ్యం. ఆ దిశగా మహాసభలో సభ్యులు విజ్ఞతతో తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉంది.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు





పీడీజే నీరజను కలిసిన ఎస్పీ మహేశ్ బీ గీతే, పోక్సో కోర్టు జడ్జి పుష్పలతను కలిసిన న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు బదిలీపై వచ్చిన న్యాయమూర్తులు బుధవారం జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ, పోక్సో కోర్టు, ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి బి.పుష్పలత బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఎస్పీ మహేశ్ బీ గీతే కలిసి, పూలమొక్క అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జూపెల్లి శ్రీనివాసరావు, తంగళ్లపల్లి వెంకటి, ఇతర ప్రతినిధులు ఉచ్చిడి శరత్‌రెడ్డి, గాజుల రాజమల్లు, సర్మెట రమేశ్, వేముల నరేశ్ జడ్జీలను కలిశారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: భూభారతి ద్వారా గతంలోని సమస్యలకు పరిష్కారమార్గం ఏర్పడుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం హన్మాజీపేటలో భూభారతి చట్టంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాట ప్రకారం నేడు భూభారతి తీసుకొచ్చినట్లు తెలిపారు. గతంలో నేను ముమ్మాటికీ భారతీయుడిని అని ప్రగల్భాలు పలికిన వ్యక్తి కూడా న్యాయస్థానం ఎదుట తలవంచి రూ.30లక్షలు చెల్లించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం కృషి చేసేదన్నారు. రూ.2లక్షలు రుణమాఫీ చేశామని, హన్మాజీపేట బ్రిడ్జి పూర్తి చేశామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. తహసీల్దార్ అబుబాకర్, ఏవోలు సాయికిరణ్, వినీత, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ దేవరాజం, నాయకులు సామ తిరుపతిరెడ్డి, చిలుక ప్రభాకర్, చెన్నాడి శ్యామల పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల: అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. త్వరగా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీలు గుర్తించిన వారితోపాటుగా ఎవరైనా నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన గృహాలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్డీవో శేషాద్రి, హౌసింగ్ పీడీ శంకర్ ఉన్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

మాతాశిశు మరణాలు నివారించాలని, గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో గత నెలలో 666 డెలివరీలు చేశామని డీఎంహెచ్‌వో రజిత తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. గైనకాలజిస్టులు అవసరం ఉంటే నోటిఫికేషన్ ఇవ్వాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

విదార్థులకు అభినందన

ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. వేములవాడ మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన హేమంత్ 496 మార్కులతో మొదటి ర్యాంకు, ఆదిల్ షరీఫ్ 483, షారుక్ 969, సంజయ్ 962 మార్కులు సాధించారు.

ఉగ్రదాడిపై ఆగ్రహజ్వాల



రాజన్న గుడి ఎదుట కొవ్వొత్తులతో నివాళి

సిరిసిల్లటౌన్/వేములవాడ: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా నాయకులు పల్లం అన్నపూర్ణ, వైశాలి, కర్ని హరీష, శ్రీకాంత్ పాల్గొన్నారు. వేములవాడ రాజన్న గుడి ఎదుట బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్, రాపెల్లి శ్రీధర్ తదితరులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

డబ్బుల్ అందవేమి?



ఆవునూర్‌లో పిల్లర్లతోనే నిలిచిన పనులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సొంతింటి కల నిజం చేసుకునేందుకు అప్పు చేసి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పనులు మొదలుపెట్టారు. అయితే బిల్లులు మంజూరుకాకపోవడంతో కొందరి ఇళ్లు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మళ్లీ అప్పు పుట్టక ఇళ్లు పూర్తికాక 'డబుల్' లబ్ధిదారులు కొందరు అద్దె ఇళ్లు.. మరికొందరు గుడిసెల్లో తలదాచుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రస్తుత ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో సొంతింటి కల నిజం చేసుకుందామనుకున్న లబ్ధిదారులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. తమను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులుగా పరిగణించి బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. – వివరాలు 10లో..




గెలుపు ఓటమి ఓ పాఠం

ఫెయిలయ్యామని కుంగిపోవద్దు • పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏమీలేదు

ఆవేశంతో జీవితాలను అంతం చేసుకోవద్దు.. ఆలోచన.. ధైర్యంతో అడుగు ముందుకేస్తే ఎన్నో విజయాలు మీ సొంతం. చరిత్ర.. గతం.. వర్తమానం చూస్తే అనేక విషయాలు ఇట్టే దోహదపడుతాయి. ఎందుకు పనికిరారు అని పలువురితో ఛీత్కారాలు ఎదుర్కొన్నవారు కష్టపడి విజయ తీరాలకు చేరుతున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. గెలుపు.. ఓటమికి నాంది అనేదానిని మరవొద్దు. సచిన్ టెండూల్కర్ అంటే తెలియని వారు ఉండరు. పదోతరగతి కూడా పాస్‌కాలేని ఆయన బ్యాట్ ఝులిపిస్తే.. పరుగుల వర్షమే కురిసేది. క్రికెట్ ఆడితే లక్షల కళ్లు ఆయనవైపే ఉండేవి. ఎన్నో ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఆయన క్రికెట్ దిగ్గజంగా ఎదిగిన విషయం మరవొద్దు.. అంతేకాదు.. శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మోటార్ న్యూరాన్ అనే వ్యాధి బారిన పడ్డా.. మనోధైర్యం కోల్పోలేదు. ఓ దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆయన గొప్ప పరిశోధకుడై ప్రపంచమే మెచ్చుకునే వాడయ్యాడు.



హుజూరాబాద్:



ప్రతిభ కొందరికే పరిమితం కాదు. ప్రతీ మనిషిలోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. దాన్ని వెలికితీసి, కఠోర సాధన చేస్తే జీవితంలో గొప్ప వ్యక్తిగా ఎదగొచ్చు. అలా కాదని నేనేం చేయలేను.. నాతో కాదు.. నేనింతే అంటూ కుంగిపోవద్దు. చదువూ అంతే.. పుస్తకాన్ని నేస్తంగా మలుచుకుని చదివితే విజయం నీ బానిస అవుతుంది. పరీక్ష నీతో స్నేహం చేస్తుంది. ఫలితం ఎప్పుడూ నీ వెంటే నడుస్తుంది. విద్యార్థులకు 'పరీక్ష'కాలం ముగిసింది. ఫలితాల సమయం సా గుతోంది. మంగళవారం నాటి ఇంటర్ ఫలితాల్లో చాలా మంది ప్రతిభ చూపారు. కొందరు ఫెయిలయ్యారు. త్వరలో పదోతరగతి ఫలితాలు రానున్నాయి. ఫలితాలను జీవితంలో ఒక భాగం మాత్రమే చూడాలి. ఓటమి గెలుపునకు గట్టి పునాదిగా మారుతుందని గ్రహించాలి. మళ్లీ ప్రయత్నించి, తప్పులను సవరించుకుని, కన్నీళ్లు పెట్టుకున్న చోట తలెత్తుకుని చూడాలి తప్పా.. విఫలమయ్యామని కఠినమైన నిర్ణయాలు తీసుకోవద్దు. గెలుపైనా ఓటమైనా.. ఓ పాఠంగా నేర్చుకోవాలి.

నిలబడి గెలవాలి

- నిరాశ మనిషిని నిలువునా చీల్చుతుంది. ఆశ జీవితాలను నిలబెడుతుంది. ఈరోజు పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామని కుంగిపోవడం, నిరాశకు గురయ్యే ఆలోచనలు పిరికివారికే తప్ప ధైర్యవంతులకు రావనేది గ్రహించాలి.
- ఓటమి గెలుపునకు నాందిగా మారుతుంది. ఒకసారి ఓడితేనే భవిష్యత్‌లో సమస్యలను అధిగమించే గుణాన్ని నేర్చుకుంటారు. ధైర్యవంతులుగా తయారవుతారు. పాజిటివ్ ఆలోచనే విజయానికి బాట.
- ఆవేశంతో తీసుకునే నిర్ణయం సరైంది కాదనే వాస్తవం గుర్తించండి. ఓటమి విజయానికి తొలిమెట్టు కావాలి. కెరటంలా ఎగిసిపడాలి.

ఇవీ ముఖ్యం..

- పరీక్ష ఫలితాల వేళ పిల్లలను హేళన చేసే విధంగా ఎవరూ మాట్లాడొద్దు. ఆశించిన ఫలితం వస్తే అభినందించాలి. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువ వచ్చినా ఓదార్చి ప్రోత్సహించాలి.
- అనుకున్న ఫలితం సాధించడంలో విఫలమైనా, తక్కువ మార్కులొచ్చినా ఏమీ కాదు.. జీవితం చాలా ఉంది. మీ వెంటే మేమున్నాం. మళ్లీ ప్రయత్నిద్దామన్న భావన కల్పించాలి.
- ఫలితాల వేళ పిల్లలు ఆందోళనకు గురవుతారు. నిరాశ, నిస్పృహ లోకి వెళ్తారు. అందుకే ఈ సమయంలో వారిని ఉత్సాహపర్చే వాతావరణం అవసరం. కుటుంబ సభ్యులు.. చుట్టూ ఉన్నవారు ఆ బాధ్యత తీసుకోవాలి.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

- పరీక్షల ఫలితాల సమయంలో తల్లిదండ్రులు పిల్లలతో గడపాలి. మార్కులు తక్కువ వచ్చినా.. లేదా ఫెయిల్ అయినా వారికి ధైర్యం ఇచ్చి మానసిక బలాన్ని అందించేవిధంగా వ్యవహరించాలి.
- విద్యార్థులు కూడా మరొకసారి సాధించి చూపుతామనే గట్టి పట్టుదలతో ధైర్యంగా ఉండి సాధించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు క్రియాశీలక పాత్ర పోషించాలి. పిల్లలను ఒంటరిగా వదలేయొద్దు.
- వారి కదలికలపై ఓ కన్నేసి ఉంచుతూనే ప్రముఖుల స్ఫూర్తిదాయక జీవితాల గురించి తెలపండి. ఫెయిలైతే చదువుకు ఆటంకం కాదని చెప్పండి. ముమ్ముందు మంచి మార్కులు, ఉత్తీర్ణత సాధించే వీలుందని ధైర్యం నూరి పోయాలి.

మనోధైర్యమే ఆయుధం



విద్యార్థులు పరీక్ష ఫలితాలు వచ్చిన సమయంలో ఆందోళనకు గురికాకుండా, పరిస్థితిని గమనించి ధైర్యంగా ముందుకు సాగాలి. ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ముగిసిపోలేదు. మొదటి విజయానికి బాసటగా భావించి, తప్పు ఎక్కడ జరుగుతుందో గమనించి, సరిచేసుకుని ముందుకు సాగాలి. – ఎల్.వర్షి, ప్రభుత్వ మానసిక వైద్య నిపుణుడు, హుజూరాబాద్

నిరుత్సాహం వద్దు



పరీక్ష ఫలితాలు జీవితాన్ని నిర్ణయించవు. ఓటమి నుంచి ఏం నేర్చుకున్నామో గ్రహించి, ఎక్కడ లోపం ఉందో పసిగట్టి, పటిష్ట ప్రణాళికతో నిరుత్సాహపడకుండా ముందుకెళ్తే విజయం బానిసవుతుంది. 20 ఏళ్ల జీవితంలో విద్యార్థులు కష్టపడితే 50ఏళ్ల జీవితాన్ని సంతోషాలతో గడపొచ్చు.
– శ్రీనివాస్‌జీ, ఏసీపీ, హుజూరాబాద్

క్లుప్తంగా

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



ప్రసన్నలక్ష్మి మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని పోచమ్మవాడలో గంగధరి ప్రసన్నలక్ష్మి (28) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పోచమ్మవాడకు చెందిన ఉప్పునీటి గంగాధర్ కుమార్తె ప్రసన్నలక్ష్మిని వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామానికి చెందిన గంగధరి తిరుపతికి ఇచ్చి 2023లో వివాహం చేశారు. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. తిరుపతి వెళ్లేందుకని ఇటీవలే జగిత్యాలలోని పుట్టింటికి వచ్చింది. ఇంతలో ఏమైందో తెలియదు గానీ.. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన మొగిలిపాలెం గంగరాజు(42)బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న నాగులమల్యాలకు చెందిన గంగారాజు ప్రతి రోజు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తుంటాడు. బుధవారం సర్వారెడ్డిపల్లిలో పనిముగించుకొని తన వాహనంపై నాగులమల్యాలకు వస్తుండగా కొత్తపల్లి శివారులోని వెలిచాల ఎక్స్‌రోడ్ దగ్గర లారీ ఢీకొట్టింది. గంగారాజుకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అజాగ్రత్తగా లారీ నడిపి తన తండ్రి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గంగరాజు కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్మకాండకు వెళ్లి యువకుడు గల్లంతు



చింతకుంట చెరువు వద్ద బంధువులు

జగిత్యాలక్రైం: కర్మకాండకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో యువకుడు గల్లంతైన సంఘటన జగిత్యాలలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన నీలి మల్లికార్జున్ నానమ్మ ఇటీవల మృతిచెందింది. బుధవారం కర్మకాండ నిర్వహించారు. శ్మశాన వాటిక పక్కనే ఉన్న చింతకుంట చెరువులో స్నానం చేస్తుండగా మల్లికార్జున్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లను రంగంలోకి దింపినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. మల్లికార్జున్ మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

డబ్బుల్ అందవేమి?

- గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరు
- ఇప్పటికీ అందని బిల్లులు
- అప్పుల ఊబిలో 2 బీహెచ్‌కే లబ్ధిదారులు
- 'ఇందిరమ్మ'కు అనర్హులు.. పాత బిల్లులకు పడిగాపులు



- ఈమె ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన కర్రోల్ల కవిత. మూడేళ్ల క్రితం కవితకు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు కాగా, కాంట్రాక్టర్ కట్టివ్వలేదు. దీంతో అప్పటి ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో డబుల్‌బెడ్‌రూమ్ పనులు మొదలు పెట్టింది. భర్త నర్సయ్య ముంబైలో కూలీ పనులు చేస్తుండగా, ముగ్గురు కూతుళ్లను కవిత పోషిస్తోంది. రూ.6లక్షలు అప్పు చేసినా.. స్లాబ్ వరకు మాత్రమే ఇల్లు పూర్తయింది. ఆమెకు ఇప్పటి వరకు రూ.2లక్షలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. మిగతా రూ.3లక్షల కోసం అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఇలా సగం బిల్లులు వచ్చిన వారు నిత్యం మండల ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



స్లాబ్ లెవల్ వరకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టుకుంటున్న ఇతను చేపూరి వెంకటేశ్‌గౌడ్. ముస్తాబాద్ మండలం ఆవునూర్. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసింది. గీత వృత్తి చేసుకునే వెంకటేశ్‌గౌడ్ అప్పు చేసి ఇంటి పనులు మొదలు పెట్టాడు. స్లాబ్‌లెవల్ వరకు రూ.6లక్షలు అప్పు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో 2బీహెచ్‌కే పనులు అటకెక్కాయి. బిల్లులు చెల్లించాలని వెంకటేశ్‌గౌడ్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. పాత అధికారులు బదిలీ కావడం.. అంతా కొత్తవారే రావడంతో ఎవరిని అడగాలో తెలియక కుమిలిపోతున్నాడు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో దాదాపు 500 మంది వరకు ఎదుర్కొంటున్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): సొంతింటి కల నిజమవుతుందనే సంతోషంలో పలువురు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు అప్పు చేసి పనులు మొదలుపెట్టారు. అయితే అంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. స్థానికంగా అధికారులూ బదిలీ కావడంతో బిల్లులు అందక ఇళ్ల పనులు పూర్తికాక అయోమయంలో పడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పట్టించుకోకపోగా.. ఆ లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా పరిగణిస్తున్నారు. దీంతో డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల పరిస్థితి రెంటికి చెడిన రేవడిలా తయారైంది.

అప్పు చేసి ఇళ్ల నిర్మాణం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం వ్యయం పెరిగిపోయిందని కాంట్రాక్టర్లు చేతులెత్తయడంతో.. లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కొందరు తమ సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పనులు మొదలుపెట్టారు. దీంతో కాంట్రాక్టర్‌కు ఇచ్చే రూ.5లక్షలను నేరుగా లబ్ధిదారుడికి ఇచ్చేలా అప్పటి ప్రజాప్రతినిధుల హామీతో జిల్లాలో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇలా మండలానికి 60 చొప్పున.. సిరిసిల్ల నియోజకవర్గంలో 500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు మంజూరుకాక అప్పులపాలయ్యారు.

ఇందిరమ్మ పథకంపై ఆశలు

కొందరు తాము ఉంటున్న పాత ఇళ్లను కూల్చివేసి.. అద్దె ఇంట్లో ఉంటూ ఇంటిపనులు చేసుకుంటున్నారు. బిల్లులు రాక.. మిగతా పనులు చేసేందుకు అప్పు పుట్టక ఇబ్బంది పడుతున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేసి బిల్లులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. అయితే హౌసింగ్‌శాఖ అధికారులు మాత్రం.. డబుల్‌బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కొలతలు వేర్వేరుగా ఉన్నాయని చెబుతున్నారు. పునాదుల నుంచి పనులు చేసే వారికే ఇందిరమ్మ వర్తిస్తుందని స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం సందిగ్ధం

ఇందిరమ్మ ఇళ్లతోపాటు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూచాయగా నిర్ణయించినట్లు సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా 2బీహెచ్‌కే లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వ నిర్ణయం రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో 2బీహెచ్‌కే లబ్ధిదారుల పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మే మొదటి వారంలో ప్రభుత్వం 2బీహెచ్‌కే లబ్ధిదారుల విషయంలో ఒక నిర్ణయం తీసుకోనుందని తెలిసింది.

గుడిసెలో ఉంటున్నం



రెండేళ్ల క్రిందట డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు సాంక్షన్ అచ్చిందని చెప్పిండ్రు. రూ.3లక్షలు అప్పు చేసి బేస్‌మెంట్, పిల్లర్ల వరకు కట్టుకున్న. నా పెనిమిటి దుబాయ్‌కు పోతే అక్కడ మోసం చేసింద్రు. ఇంటికొచ్చి, గుంట జాగ అమ్మి మళ్లా దుబాయ్‌కు పోయిండు. నా బిడ్డ, నేను గుడిసెలో ఉంటున్నం. కలెక్టర్ సారూ.. ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ ఇప్పించి ఆదుకోవాలే.

– లింగాల గౌరవ్వ, చీకోడు

ప్రభుత్వానికి నివేదించాం

గతంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని ఆర్ అండ్‌బీ చూసింది. ఇళ్ల పనులు మొదలుపెట్టిన వారి వివరాలు.. ఎంతమేరకు బిల్లులు చెల్లించామో అధికారులకు అందించాం. 2బీహెచ్‌కే లబ్ధిదారులు, బిల్లులు రాని వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గృహనిర్మాణ శాఖకు అప్పగించారు.

– శాంతయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ

జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు కరీంనగర్‌రోడ్‌లోగల ఓ చిట్‌ఫండ్‌లో రూ.5 లక్షల డిపాజిట్ చేశాడు. కాల పరిమితి ముగిసి ఏడాది కావస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో 15 రోజుల క్రితం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు చిట్‌ఫండ్‌పై కేసు నమోదు చేశారు.

జగిత్యాల పట్టణంలోని ఓ షాపు నిర్వాహకుడు రాజు కరీంనగర్‌రోడ్‌లోగల లో చిట్‌ఫండ్‌లో రూ.2 లక్షలు డిపాజిట్ చేశాడు. కాల పరిమితి ముగిసి చాలా రోజులు అవుతున్నా డబ్బులు చెల్లించకపోవడంతోపాటు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. ఇటీవల బాధితులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సదరు చిట్‌ఫండ్‌పై కేసు నమోదు చేశారు.

'చీట్'ఫండ్ వ్యాపారం

- జగిత్యాల జిల్లాలో ప్రతినెలా రూ.70 కోట్ల లావాదేవీలు
- కాలపరిమితి ముగిసినా డబ్బులు చెల్లించని నిర్వాహకులు
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్న ఖాతాదారులు



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో విచ్చలవిడిగా చిట్‌ఫండ్ వ్యాపారం కొనసాగుతోంది. ఇది చాలదన్నట్లు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే ఫైనాన్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లాలో దాదాపు 33 చిట్‌ఫండ్ కంపెనీలు ఉన్నాయి. వీటిలో కేవలం పదింటికి మాత్రమే లైసెన్స్ ఉంది. అలాగే జిల్లాలో 100కు పైగా ఫైనాన్స్‌లు నడుస్తున్నాయి. అనధికారికంగా మరో 150 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. చిట్‌ఫండ్ల వ్యాపారం రూ.80 కోట్ల వరకు.. ఫైనాన్స్ వ్యాపారం రూ.70 కోట్ల వరకు జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్ నిర్వాహకులు అయితే తెల్ల పేపర్లపై లేకుంటే ఖాళీచెక్కులపై సంతకాలు చేయించుకుని 4 నుంచి 8 శాతం వడ్డీకి అప్పులిస్తున్నారు. పెద్ద ఎత్తున వడ్డీ వసూలు చేస్తున్నా.. నిబంధనలకు విరుద్ధంగా చిట్స్‌ఫండ్ ఫైనాన్స్ కొనసాగిస్తున్నా.. వారిపై నిఘా కరువైంది.

చిట్స్‌ఫండ్స్ మోసాలు

జిల్లాలో ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులు, ఇతరత్రా వ్యక్తుల నుంచి లైసెన్స్‌డ్ చిట్స్‌ఫండ్ నిర్వాహకులు పెద్ద ఎత్తున చిట్టీలు వేయించుకొని కాలపరిమితి ముగిసినా డబ్బులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ చిట్‌ఫండ్ కార్యాలయంలో బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. చిట్‌ఫండ్స్ కంపెనీలో చిట్టీ తీసుకునే వారు ప్రభుత్వ ఉద్యోగితో ష్యూరిటీగా తీసుకొని డబ్బులు చెల్లిస్తారు. కానీ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా సమయానికి డబ్బులు ఇవ్వకపోవడం చిట్స్‌ఫండ్ మోసాలకు దారితీస్తోంది. జిల్లాలో రిజిస్టర్ లేని చిట్టీలు కోట్ల వ్యాపారంలో కొనసాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొందరు చిట్టీ నిర్వాహకులు వ్యాపారంలో నష్టాలు వచ్చాయని పారిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.

తాకట్టు వ్యాపారం

జిల్లాలో తాకట్టు వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో చాలామంది డబ్బులు అవసరమున్న వారు వాహనాల పేపర్లతోపాటు బంగారం, భూమి కాగితాలు పెట్టి అధిక వడ్డీకి అప్పు ఇస్తున్నారు. అప్పు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకుంటే తాకట్టు పెట్టిన వస్తువులను వ్యాపారులు అమ్ముకుంటున్నారు. చాలా మంది వడ్డీ వ్యాపారులు తెల్లపేపర్లపై స్టాంప్ పేపర్లు, చెక్కులపై సంతకాలు చేయించుకుని ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. రిజిస్టర్ అయిన చిట్‌ఫండ్స్ నిర్వాహకులు డిపాజిట్లు సేకరించి.. కాలపరిమితి ముగిసినా డిపాజిటర్లకు డబ్బులు చెల్లించకుండా సుమారు ఏడు కంపెనీలు తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. ఫలితంగా బాధితులు పోలీస్‌స్టేషన్‌లు, కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

అనుమతుల్లేని ఫైనాన్స్‌లపై చర్యలు



జగిత్యాల జిల్లా కేంద్రంలో అనుమతులు లేని ఫైనాన్స్‌లు, చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలు చేపడతాం. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. మూతపడిన చిట్‌ఫండ్స్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాం.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ బుధవారం తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. గతేడాది జూలైలో గుంటూరుపల్లిలో దొంగలు తాళంవేసి ఉన్న ఇంట్లో చొరబడి రూ.2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ రోడ్డులోని రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగుటగొట్టి మద్యం సీసాలు, బైక్ అపహరించారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్, హత్రుసింగ్, జితేన్‌లు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందని ఏసీపీ వివరించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు ప్రదీప్‌ను గత నెలలో రిమాండ్‌కు పంపించామని, మరో నిందితుడైన హత్రుసింగ్‌ను కొత్తపల్లి ఎస్సై ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో దార్ జిల్లా నరవాలిలో అదుపులో తీసుకొని బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈకేసులో మరో నిందితుడు జితేన్ పరారీలో ఉన్నాడని త్వరలోనే ఆయనూ పట్టుకుంటామని ఏసీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది శ్రీనాథ్, అబ్దుల్ ఖదీర్, షరీఫ్, సాంబరెడ్డి, దేవేందర్‌ను అభినందించారు.

కట్నం వేధింపులకు యువతి బలి



జమున (ఫైల్)

జగిత్యాలక్రైం/బుగ్గారం: కొడిమ్యాల మండలకేంద్రంలో వివాహిత దుబ్బాక జమున (23) కట్నం వేధింపులకు బలైంది. స్థానికుల కథనం ప్రకారం.. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన జమునను ఏడాది క్రితం కొడిమ్యాలకు చెందిన దుబ్బాక రాహుల్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో కట్నకానుకలతోపాటు సామగ్రి, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. కొద్దికాలంగా రాహుల్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక జమున క్రిమిసంహారక మందు తాగింది. అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జమునను కట్నం కోసం వేధించి భర్తతోపాటు అత్తమామలు హత్య చేశారంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని నిందితులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. మృతురాలి తల్లి కొమ్ము పోశవ్వ ఫిర్యాదు మేరకు జమున భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. జమున మృతదేహానికి బుగ్గారంలో దహన సంస్కారాలు నిర్వహించగా.. తల్లి పోశవ్వ తలకొరివి పెట్టింది.



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న తల్లి

పోయిందనుకున్న బంగారం దొరికింది

మల్యాల(చొప్పదండి): మండలంలోని నూకపల్లికి చెందిన ఓ గృహిణి మూడు రోజుల క్రితం దొడ్డుబియ్యాన్ని ఓ వ్యక్తికి విక్రయించింది. అందులో మూడు తులాల బంగారం దాచిన విషయాన్ని మరిచిపోయింది. తర్వాత గుర్తుకొచ్చి సదరు వ్యక్తి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. రెండురోజులు క్రితం సదరు వ్యక్తి నూకపల్లికి రాగా.. గృహిణి అతడిని ప్రశ్నించింది. తాను బంగారాన్ని చూడలేదని.. ఆ బియ్యాన్ని గొల్లపల్లి మండలం గుంజపడుగుకు చెందిన ఒకరికి విక్రయించినట్లు చెప్పాడు. గుంజపడుగుకు వెళ్లి ఆ బియ్యంలో వెదికారు. అందులో బంగారం బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు




హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వేములవాడ: రాజన్నకు భక్తుల ద్వారా 29 రోజుల్లో రూ.2.01కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం హుండీలను లెక్కించారు. రూ.2,01,53,852 నగదు, 184 గ్రాముల బంగారం, 12.300 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

- భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు



ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారులు

కోల్‌సిటీ(రామగుండం): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నవారికి బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ప్రారంభించారు. ఈనెల 21వ తేదీ వరకు మొత్తం 11,446 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 8,195 మంది బల్దియా కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించారు. యూనిట్ల వారీగా అర్హులను గుర్తించడం కోసం ఈనెల 30వ తేదీ వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ తెలిపారు. తొలిరోజు ఎన్టీపీసీ, రామగుండం ఏరియాలకు చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ రెండు బ్యాంకులకు 1,050 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇద్దరే అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించడంతో ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.

జగిత్యాలకు రెడ్ అలర్ట్



కర్చీఫ్‌లతో బైక్‌పై వెళ్తూ..

- మరో నాలుగు రోజులూ ఎండలే
- రోజురోజుకూ ఆగ్రహిస్తున్న సూర్యుడు
- బుధవారం 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత

జగిత్యాలఅగ్రికల్చర్: కొద్దిరోజులుగా సూర్యుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్‌లోనే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయి. ఇక మే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండవచ్చని పొలాస వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఉత్తర వాయువ్య దిశ నుంచి వడగాలులు వీస్తుండటం వల్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నాలుగు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 నుంచి 45 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.8 డిగ్రీల సెల్సియస్‌లో కదలాడుతున్నాయి. రానున్న రెండుమూడు రోజుల్లో మరో రెండు డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం గంటకు 30 నుంచి40 కిలోమీటర్ల వేగంతో వడగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం వేడితో కూడిన వడగాలులు వస్తుండటంతో ప్రజలు అతులాకుతలం అవుతున్నారు. గాలిలో తేమ శాతం తగ్గడంతో ఉక్కపోత మొదలైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉంటోంది.

వడదెబ్బతో విలవిల

ఉష్ణోగ్రతలు పెరిగినకొద్దీ శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకు వెళ్తుంది. దీంతో నీరసం వస్తుంది. నీటి శాతం తక్కువ అయినప్పుడు వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉంది. దీనికితోడు దురద, చెమటకాయ, పొక్కులు, నల్లటి మచ్చలు ఏర్పడతాయి. కళ్లు మంటలు మండి ఎరుపుచారలు వస్తాయి. గ్రామాల్లో లోతైన బావుల నీరు తాగినప్పుడు విరోచనాలు, వాంతులు అయ్యే అవకాశం ఉంటుంది. ఎండకు వెళ్లినప్పుడు కళ్లజోళ్లతోపాటు చర్మం పూర్తిగా కప్పేలా బట్టలు ధరించడం మంచిదంటున్నారు వైద్యులు. శరీరాన్ని చల్లగా ఉంచుకునేందుకు మజ్జిగ, పెరుగు, నిమ్మరసాలు తీసుకోవాలంటున్నారు.

వాతావరణ మార్పులే కారణం

వాతావరణంలో అప్పటికప్పుడు వస్తున్న మార్పులే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కార్బన్‌డైఆక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఇతర గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫలితంగా భూమి ఉపరితల ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోతుండటంతో పర్యావరణంలోనూ, వాతావరణంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

జగిత్యాల జిల్లాలో ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. రాయికల్, ధర్మపురి మండలం నేరేళ్ల, కోరుట్ల మండలం అయిలాపూర్, గొల్లపల్లి మండలాల్లో 44.1 డిగ్రీలు, ఎండపల్లి మండలం మారెడుపల్లి, సారంగాపూర్, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44 డిగ్రీల సెల్సియస్ చొప్పున నమోదయ్యాయి. రానున్న నాలుగు రోజులు కూడా ఎండలు పెరిగే అవకాశం ఉండడంతో జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

బయటకు వెళ్లలేని పరిస్థితి



ఉదయం 8 గంటలకే ఎండలు మండుతున్నాయి. బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం ఆరుగంటల తర్వాత కూడా వేడిగాలులు వీస్తున్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. ఎండలకు కూలీలు కూడా వ్యవసాయ పనులకు రావడం లేదు.

– ఏలేటి స్వామిరెడ్డి, శ్రీరాములపల్లె, గొల్లపల్లి(మం)

మరో నాలుగు రోజులు



వాతావరణ మార్పులతో రానున్న నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశం ఉంది. వాతావరణ విభాగం వారు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం భూమిలో తేమ శాతం ఎక్కువగా లేకపోవడంతో ఉష్ణోగ్రతలకే ప్రజలు అల్లాడిపోతున్నారు. వడగాలుల ప్రభావం తీవ్రంగా ఉంది.

– శ్రీలక్ష్మి, వాతావరణ శాస్త్రవేత్త, పొలాస